క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్చంపేట: మండలంలోని నాలుగు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శుక్ర, శని వారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ శివకోటిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో తరచూ వచ్చే అంతరాయాలను నివారించడంలో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం అనివార్యమైనందున వినియోగదారులు సహకరించవలసినదిగా ఏఈ శివకోటిరెడ్డి కోరారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

క్రోసూరు: ఈ నెల 20వ తేదీ మోడల్‌స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న ఆరవ తరగతి ప్రవేశ పరీక్షను ఈ నెల 21కి మార్చడమైందని క్రోసూరు మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ మేరీసూజన్ ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఈస్టర్ సందర్భంగా సెలవు దినంగా ప్రకటించటంతో 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేసారన్నారు. కావున ఈ నెల 21న ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. హాల్ టికెట్లు www.csc.ap.gov.in, www.apms.apcfss.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

260 మందికి కంటి వైద్య పరీక్షలు



అచ్చంపేట: అంతర్జాతీయ సహకార సంవత్సరం–2025లో భాగంగా స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం వద్ద గురువారం ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 260 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఇన్నారావు రోగులకు బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అవసరాన్ని బట్టి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కొంతమందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపిక చేసినవారికి సత్తెనపల్లిలోని ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులచే ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంకట్రావు, ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో అన్నసంతర్పణ

సత్తెనపల్లి: శ్రీరామనవమి సందర్భంగా పట్టణంలోని భావనారుషి నగర్ కొత్తపేటలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

నీటి తీరువా ఆన్‌లైన్ మాడ్యూల్ పూర్తి చేయాలి



ముప్పాళ్ల: నీటి తీరువాకు సంబంధించి ఆన్‌లైన్ మాడ్యూల్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో గురువారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మీ సేవ, సచివాలయాల ద్వారా అందిన అర్జీలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకాల అర్జీలను క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేసి త్వరితగతిన అందేలా చూడాలన్నారు. రీ సర్వే ప్రక్రియలో భాగంగా ముందుగా ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



అమరావతి: మండల కేంద్రమైన అమరావతి గోపాల్‌నగర్‌లో గురువారం సాయంత్రం గడ్డివాము దగ్ధమైన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం మధ్యాహ్నం గోపాల్‌నగర్‌లోని పెద్దిబోయిన బుల్లియ్యకు చెందిన 10 ట్రాక్టర్ల గడ్డివామికి ప్రమాదవశాత్తూ నిప్పంటుకుంది. ఇది గమనించిన చుట్టుపక్కల వారు క్రోసూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇటీవల సుమారు రూ.2.5 లక్షలతో పది ట్రాక్టర్ల గడ్డిని కొనుగోలు చేసి వాము వేసినట్లు బాధితుడు బుల్లియ్య తెలిపారు.

పర్యవేక్షణ లోపం.. తూకాలలో మోసం

- జాడే లేని ఆహార సలహా కమిటీలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న దుకాణదారులు
- సరుకుల పంపిణీలో అవకతవకలు
- ఇబ్బందులు పడుతున్న కార్డుదారులు



లంకెలకూరపాడులో రేషన్ సరుకులు పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ భవానిశంకర్(పాతచిత్రం)

ముప్పాళ్ల: పేదలకు నిత్యావసర సరుకులు అందించే రేషన్ దుకాణాలలో అక్రమాలు జరగకుండా ఆహార సలహా కమిటీలు పర్యవేక్షిస్తుండేవి. గతంలో ఎంతో బాధ్యతతో ప్రతి మూడు నెలలకొకసారి మండల స్థాయిలో ఆహార సలహా కమిటీల సమావేశాలు జరిగేవి. మండల పరిధిలో ఉన్న రేషన్ దుకాణాల నిర్వహణ, పనితీరుపై సమీక్షించేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. ఆహార సలహా సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తూకాలలో మోసాలు జరుగుతున్నాయి. లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దుకాణదారులు ఇచ్చిందే తీసుకొని వెళ్లాల్సిన దుస్థితి కార్డుదారుల వంతైంది. అదేమంటే సరుకులు లేవంటూ వెనక్కి పంపిస్తున్నారు.

సత్తెనపల్లి డివిజన్ పరిధిలో...

సత్తెనపల్లి డివిజన్ పరిధిలో మొత్తం 9 మండలాలకు గాను 354 రేషన్ దుకాణాలు.. 1,79,379 రేషన్ కార్డులు ఉన్నాయి. మొత్తం 112 ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసరాలు అందిస్తున్నారు. ఆయా దుకాణాల ద్వారా జరుగుతున్న సరుకుల పంపిణీని పర్యవేక్షించేందుకు ఆహార సలహా కమిటీలకు చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకొకసారి సభ్యులు సమావేశమై ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి



తహసీల్దార్ కార్యాలయం

తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించేవారు. అయితే నేటి పరిస్థితి చూస్తే భిన్నంగా ఉంది. అంతేకాక గతంలో బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార, గోధుమపిండి లాంటివి అందించేవారు. నేడు బియ్యంతోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి.

తూకాలలో తేడాలు

ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో దుకాణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రేషన్ షాపులలో తూకాలలో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ సరుకులు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థను పూర్తిగా గాడి తప్పించింది. రేషన్ సరఫరా చేసే వాహనాలను కొన్ని చోట్ల నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ముప్పాళ్ల మండలంలోని ముప్పాళ్ళ, మాదల గ్రామాల్లో నిత్యావసర సరుకుల పంపిణీపై జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు అందటంతో మండల స్థాయిలో అధికారులు విచారణ జరిపి నివేదికలు అందించారు.

డివిజన్‌లో రేషన్ దుకాణాలు, రేషన్ కార్డులు ఇలా...

మండలం	దుకాణాలు	కార్డులు
బెల్లంకొండ	16	9,962
ముప్పాళ్ళ	30	13,590
రాజుపాలెం	25	15,817
పెదకూరపాడు	34	16,515
క్రోసూరు	43	19,831
నకరికల్లు	41	20,552
అచ్చంపేట	50	20,693
అమరావతి	45	22,176
సత్తెనపల్లి	70	40,243

కమిటీల ఉనికే లేదు



గతంలో ఆహార సలహా సంఘాలు ఏర్పాటు చేసి మూడు నెలలకొకసారి సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపులలో వచ్చే లోటుపాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కారం చేసేవారు. ప్రస్తుతం కమిటీల ఉనికి లేకుండా పోవడంతో నిత్యావసరాల పంపిణీ అస్తవ్యస్థంగా మారింది.

– గుంటుపల్లి బాలకృష్ణ, సీపీఎం మండల కార్యదర్శి

బియ్యంతోనే సరిపెడుతున్నారు



రేషన్ దుకాణాల ద్వారా బియ్యం మాత్రమే అందిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో కొంత మందికి మాత్రమే కందిపప్పు అందిస్తున్నారు. అడిగితే సరుకు రాలేదంటున్నారు. ఏ నెలలో ఏది వస్తుందో తెలియటం లేదు. గతంలో మాదిరిగానే కార్డుదారులకు అన్ని నిత్యావసరాలు రేషన్ దుకాణాల ద్వారా అందించాలి.

– రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

త్వరలో పూర్తి చేస్తాం

ఆహార సలహా సంఘాల ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రతి దుకాణం పరిధిలో త్వరలోనే సంఘాలను ఏర్పాటు చేయాలని ఆయా మండలాల తహసీల్దార్‌లకు ఆదేశాలు జారీ చేశాం. అన్ని మండలాల్లోను ఆహార సలహా సంఘాల కమిటీలు పూర్తి చేస్తాం.

–జీవీ రమణకాంతరెడ్డి, ఆర్డీవో, సత్తెనపల్లి

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి సభ్యులు



రాజుపాలెం బీసీ హాస్టల్‌లో మహాత్మా పూలే జయంతి వేడుకలు

క్రోసూరు: క్రోసూరులో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిలకా భాస్కరరావు ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర హానరబుల్ చైర్మన్ గార్లపాటి దాసు పాల్గొని మాట్లాడుతూ జ్యోతిరావు పూలే 19వ శతాబ్దమునకు చెందిన గొప్ప సంఘ సంస్కర్త, సంఘ సేవకుడు, రచయిత, తత్వవేత్త, విప్లవ కారుడు అని అన్నారు. జ్యోతిరావుపూలే జీవితమంతా మహిళలకు విద్యా హక్కు కల్పించడం, బాల్య వివాహాలను అరికట్టడానికి ఎంతగానో కృషి చేసారన్నారు. మహిళల పురోగతికి ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. స్త్రీ విద్య పట్ల సమాజంలో ఉన్న దురాచారాల నుంచి నిర్మూలించటానికి జ్యోతిరావు పూలే పెద్ద ఎత్తున ఉద్యమం చేసిన మహాత్ముడు జ్యోతిరావు పూలే అని అన్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ చర్మకారుల సేవా సంఘం మండల ఉపాధ్యక్షులు కంభంపాటి నాగయ్య. మండల కార్యదర్శి కిన్నెర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

సత్తెనపల్లి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జరుగుతాయని ఆ పార్టీ నాయకులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా మహాత్మా పూలే జయంతి వేడుకలు

రాజుపాలెం: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ కుల ఆధారిత అణచివేతను ఎదుర్కోవడానికి సత్యసోధక్ అనే సంస్థను స్థాపించి దళితులు, మహిళల సాధికారత కోసం ఆయన ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ముందుగా పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి రవి, హెల్ప్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీలత, టీచర్ మస్తాన్, ఐటీఐ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, హాస్టల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పన్నులు ఏక మొత్తంగా చెల్లిస్తే వడ్డీపై రాయితీ

సత్తెనపల్లి: పట్టణంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను ఏక మొత్తంగా ఈ నెల 30లోపు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం వడ్డీపై 50 శాతం రాయితీ కల్పిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్ గురువారం తెలిపారు. 2025–26 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్నులను సంవత్సర మొత్తంగా ముందస్తు చెల్లింపుపై ప్రభుత్వం ఐదు శాతం రిబేట్ అవకాశం ఈ నెల 30 వరకు కల్పించిందన్నారు. ఈ నెల 30లోగా పట్టణ ప్రజలు పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, నీటి చార్జీలు మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో గానీ, మీసేవలో గానీ, సీడీఎంఏ వెబ్‌సైట్‌లో గానీ, పురమిత్ర యాప్ ద్వారా గానీ చెల్లించి తగు రసీదు పొందాలని కోరారు. ఆదివారం, అన్ని ప్రభుత్వ సెలవు దినములలో కూడా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామన్నారు.

ఎత్తు పెంచండి..!

మండలంలోని చింతపల్లి బీసీ కాలనీ రోడ్డులోని గంగయ్య ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ అతి తక్కువ ఎత్తులో అమర్చడం వల్ల ప్రమాదం పొంచి ఉంది. వేసవి సెలవులలో విద్యార్థులు ఇక్కడే అడుకుంటూ ఉంటారు. పొలాల నుంచి వచ్చే గేదెలు కూడా విద్యుత్ స్థంభాన్ని రాసుకుంటూ వెళుతుంటాయి. సంబంధిత విద్యుత్ శాఖ వారు ప్రమాదం జరగక ముందే సమస్యకు పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– అచ్చంపేట



చింతపల్లిలో తక్కువ ఎత్తులు అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

అచ్చంపేట: స్థానిక జెడ్పీ గెస్ట్ హౌస్ వద్ద కాటూరి హాస్పిటల్స్ వైద్యులచే శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో జనరల్ వైద్య సేవలతో పాటు కార్డియాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్టీ, అప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ తదితర విభాగాలలో వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అవసరమైన వారికి ఆపరేషన్స్‌తోపాటు, మందులు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని మండల, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవలసినదిగా వారు కోరారు.

నాటుసారా నిర్మూలనకు గ్రామస్తులు సహకరించాలి

ఎక్సైజ్ సీఐ కె.సోమయ్య



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ సోమయ్య

నకరికల్లు : నాటుసారా కాచినా, అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ కె.సోమయ్య హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో కేటగిరీ–ఏలో మండలంలోని చేజర్ల, చేజర్ల తండా గ్రామాల్లో నాటుసారా అనుమానిత స్థావరాలపై గురువారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేసి గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా గురించి ఎలాంటి సమాచారం ఉన్నా 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. యువత చెడు మార్గంలో వెళ్లకుండా భవిష్యత్‌ను చక్కగా మలచుకోవాలని సూచించారు. నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో గ్రామస్తులు సహకరించాలని అన్నారు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల విస్తృత తనిఖీలు



మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు వెంకటేశ్వరరావు, సంజీవరావు

పెదకూరపాడు : విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై విద్యుత్ విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. సీఆర్డీఏ సర్కిల్ పర్యవేక్షణ ఇంజనీర్ పి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారి డీఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్స్ ఇంజనీర్ సంజీవరావు పర్యవేక్షణలో మండలంలోని కాశిపాడు, బుచ్చియ్యపాలెం, గారపాడు, హుస్సేన్ నగరం, లగడపాడు, పరస, పాటిబండ్ల, పొడపాడు, రామాపురం గ్రామాల్లో తనిఖీలు చేశారు. 46 మంది విద్యుత్ అధికారులు, 189 మంది సిబ్బందితో 3,221 సర్వీస్‌లను తనిఖీ చేసినట్లు తెలిపారు. వెంకటేశ్వరరావు, సంజీవరావు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్ మీటర్ లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 12 మందికి రూ.31 వేలు, అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఆరుగురిపై రూ.77 వేలు, అనుమతించిన కేటగిరి మించి విద్యుత్ వాడుతున్న నలుగురిపై రూ.18 వేలు, అధిక లోడు వినియోగిస్తున్న నలుగురిపై రూ.18 వేలు, వాడకం కంటే బిల్లు తక్కువ వచ్చిన సర్వీస్‌కు రూ.20 వేలు అపరాధ రుసుము వేసినట్లు తెలిపారు. తనిఖీల్లో మొత్తం రూ.1.64 లక్షల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. దాడుల్లో డీఈఈలు రవికుమార్, మల్లికార్జున్ రావు, కోటేశ్వరరావు, ఏఈలు చంద్రశేఖర్, కోటేశ్వరరావు, సతీష్ కుమార్, శివశంకర్, రామకృష్ణలు పాల్గొన్నారు.

1,200 మంది ఓటర్లకు మించితే మరో పోలింగ్ కేంద్రం

రెవెన్యూ డివిజనల్ అధికారి జీవీ రమణకాంతరెడ్డి



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణకాంతరెడ్డి

సత్తెనపల్లి: ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో 1,200 మంది ఓటర్లకు మించితే మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి జీవీ రమణకాంతరెడ్డి అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు 1,500 మంది ఓటర్లకు మించకుండా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇకపై ప్రతి 800 నుంచి 1,200 మంది లోపు ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో పోలింగ్ కేంద్రాల సంఖ్య పెరుగుతుందన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ముప్పాళ్ళ తహసీల్దార్ భవానీశంకర్, రాజుపాలెం, నకరికల్లు డిప్యూటీ తహసీల్దార్లు జానీబాషా, కొండారెడ్డి, మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ సతీష్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాకు బీఎల్వోలు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ రమణకాంతరెడ్డి



హాజరైన బూత్ లెవల్ అధికారులు

ఆర్డీఓ జీవీ రమణకాంతరెడ్డి

సత్తెనపల్లి: తప్పులు లేని ఓటర్ జాబితా తయారీకి బూత్ లెవల్ అధికారులు(బీఎల్వోలు) కృషి చేయాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి జీవీ రమణకాంతరెడ్డి అన్నారు. సత్తనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామంలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారుల శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బీఎల్ఓలు విధులు తూచా తప్పకుండా నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితా పక్కాగా తయారు చేసినట్లయితే 90 శాతం సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రతి ఒక్క బూత్ లెవల్ అధికారి తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు చేయుటకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. శిక్షణలో సత్తెనపల్లి తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, ముప్పాళ్ళ తహసీల్దార్ భవానీశంకర్, రాజుపాలెం తహసీల్దార్ దుర్గేష్, నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పారే మార్గం లేక..!





పెదకూరపాడులోని ఎస్సీ కాలనీలో పలుచోట్ల మురుగునీరు రోడ్డు మీదకు చేరుతోంది. ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థపు నీరు ముందుకు పారే మార్గం లేక రోడ్డుపైన ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో క్రిమికీటకాలు వృద్ధి చెంది కాలనీ వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు. పెదకూరపాడులోని ఆనందపేట, అంబేడ్కర్ కాలనీలోని రామాలయం వీధిలో మురుగు రోడ్డుపైనే నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ముందకు పారే మార్గం లేక నిలిచిపోతున్నాయి. మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, మురుగును తొలగించి మురుగునీరు ముందుకు పారేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు వేడుకుంటున్నారు.

– పెదకూరపాడు

షిరిడీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు

పాలువాయి జంక్షన్ (రెంటచింతల): పాలువాయి జంక్షన్ వద్ద ఉన్న షిరిడీసాయి దేవస్థానంలో బాబాకు ప్రధాన అర్చకులు గోపాల్ పాండే ఆధ్వర్యంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనేక గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భజన బృందం బాబా గీతాలను ఆలపించింది. దేవస్థానం చైర్మన్ పందిరి శ్రీనివాసరావు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మాచర్లరూరల్: రోడ్డు దాటుతున్న సమయంలో ఓ మహిళను ఆటో ఢీకొనటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని రింగ్‌రోడ్డు సెంటర్‌లో గురువారం జరిగింది. పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌బీ (55) పొలం పనుల నిమిత్తం రోడ్డు మీదకు వచ్చి రోడ్డు దాటుతుండగా అటుగా వస్తున్న టాటామ్యాక్సీ ఆటో ఢీకొనటంతో ఆమె తలకు తీవ్రగాయమైంది. గాయపడిన ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతిచెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.